నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం,20 జనవరి 2025



# జెకేసిటి ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నీ-2025

**- విజేతగా వేగితోట**



**చింతూరు, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ కేంద్రంలో క్రీడలను ప్రోత్సాహించాలి, క్రీడలలలో గ్రామీణ యువకులు రాణించాలి, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ముఖ్యద్దేశంతో ఏజెన్సీలో యువతను ప్రోత్సహిస్తూ జమాల్ ఖాన్ చారిటీబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సహాయ సహకారలు అందిస్తూన్న చైర్మన్ జమాల్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలలో భాగంగా చింతూరు, సంతపాకాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్లో డివిజన్ నుండి 28 జట్లు పాల్గొనగా, ప్రథమ స్థానంలో వేగితోట, ద్వితీయ స్థానంలో చొప్పల్లి టీమ్‌లు నిలిచాయి. ఎంతో హెూరాహెూరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదటి సెట్‌ను వేగితోట 25 చొపల్లి 23, రెండో సెట్ అంతే హెూరాహెూరీగా చివరివరకు పోరాడుతు ఆడిన వేగితోట-చొప్పల్లి మధ్య మ్యాచ్ ఉత్కంఠభరింతంగా సాగిన రెండో సెట్ ను 30-28 తేడాతో వేగితోట కైవసం చేసుకుని ట్రోఫీ విజేతగా నిలిచింది. విజేత మరియు రన్నర్ టీమ్ లకు అభినందనలు తెలిపారు. ఏజెన్సీల్లో క్రీడలను ప్రోత్సహించి ముందుకు వెళ్తున్న ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# లోకేష్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలి

**- తెలుగుదేశం పార్టీ భవిష్యత్ నాయకుడు నారా లోకేష్**

**- పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌విఎస్ఎన్ వర్మ**

**పిఠాపురం, మేజర్‌న్యూస్ :** సీఎం చంద్రబాబు తనయుడు నారా లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని, తెలుగుదేశం పార్టీ భవిష్యత్ నాయకుడు లోకేష్ అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టిడిపి అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ ఎన్ వర్మ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో వర్మ మాట్లాడుతూ... కోటి సభ్యత్వాలు నమోదుకు కృషి చేసిన తమ నాయకుడు గౌరవ లోకేష్ కు పిఠాపురం తెలుగుదేశం పార్టీ తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు. ప్రపంచంలో మొదటి సారిగా ఇన్సురెన్స్ ప్రవేశపెట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, మొట్ట మొదటి సారిగా కార్యకర్తలకు ఇన్సురెన్స్ అందించి, ఇన్సురెన్స్ 2 లక్షలు నుండి 5 లక్షలకు పెంచారని తెలిపారు. తమ యువనేత లోకేష్ డిప్యూటీ సీఎం కావాలని కోటి మంది కార్యకర్తల కోరిక ! అని ఇందులో తప్పేముందని ప్రశ్నించారు. ప్రతి పార్టీలోనూ కార్యకర్తలకు వారి యొక్క నాయకుడు



పై పదవిలో ఉండాలని కోరుకుంటారని, మొదటిసారిగా రాజకీయ పార్టీలలోని కార్యకర్తలకు ఇన్సూరెన్స్ విధానాన్ని తీసుకువచ్చి కార్యకర్తలను ఆదుకున్న నాయకుడు లోకేష్ అని, గతంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా ఉండి ఈ రాష్ట్రంలో సుమారు 75% తగ్గకుండా గ్రామాల్లో రోడ్లు వేసిన ఘనత లోకేష్ కే దక్కుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు కోసం మూడు వేల కిలోమీటర్లు యువగళం పాదయాత్ర నిర్వహించడం జరిగిందన్నారు. తమ యువనేత లోకేష్ డిప్యూటీ సీఎంగా ఉండాలని కార్యకర్తలు అడుగుతున్న విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యకర్తలు ఎందుకు అడుగుతున్నారని అర్థం చేసుకోవాల్సిన విషయం పార్టీ అధ్యక్షుడిదని, ఒక పార్టీ నడిపించే అధ్యక్షుడు కార్యకర్తల మనోభావాలు ఎలా ఉన్నాయి అన్నది పరిగణలోకి తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యకర్తలకు ధైర్యం చెప్పి ప్రజల్లో ఒక నమ్మకం కలిగించిన నాయకుడికి ఇవాళ డిప్యూటీ సీఎం చేయాలని ఎవరైనా కోరడంలో తప్పేముందన్నారు. కార్యకర్తలు కోరుతున్నారు కాబట్టి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని,నేను మీ అందర్నీ కోరుతున్నానని, నా మాటలు వక్రీకరించకండి, నేను తెలుగుదేశం పార్టీకి సైనికుడి లాంటి కార్యకర్తనని, 23 సంవత్సరాల నుంచి పార్టీలో పని చేస్తా ఉన్నానని, చంద్రబాబు నాయకత్వంతో పాటు భవిష్యత్ తరాలకి లోకేష్ నాయకత్వం కావాలని అన్నారు. మా నాయకులు మాకు ఏమీ ఆదేశిస్తే అది పనిచేసే కార్యకర్తలమని, గత ఎన్నికల్లో ఓటమి పార్టీకి మద్దతు తెలపాలని పార్టీ ఆదేశిస్తే... అదేవిధంగా పనిచేశామన్నారు.

## నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

**- వెటర్నరి ఎడి రామస్వామి**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేది నుండి 31వ తేది వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు పెద్దాపురం, కిర్లంపూడి మండలాల పరిధిలో నిర్వహించడం జరుగుతుందని, వెటర్నరి అసిస్టెంట్ డైరెక్టర్ టి.ఎన్.వి.ఎ.రామస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ పశు వైద్యులు, పారా పశు వైద్యులు సిబ్బందితో కూడిన బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, సోమవారం పెద్దాపురం మండలంలోని తాటిపర్తి, కాంద్రకోట గ్రామాలలో, కిర్లంపూడి మండలంలో జగపతి నగరం, ముక్కొల్లు గ్రామాలలో ఈ పశు ఆరోగ్య శిబిరాలను ప్రారంభించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని ఎడి రామస్వామి తెలిపారు. కావున పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని, ఆయన తెలిపారు. గొర్రెలు, మేకలు, లేగదూడలకు, నట్టల నివారణ మందులు, ఉచితంగా అందిస్తారని, పశువులను వైద్య పరీక్షలు చేయడంతో పాటు గర్భకోశ వ్యాధులకు సంబంధించి అవసరమైతే శస్త్రచికిత్సలకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.పశు పోషకులు, రైతులు తో సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఆర్థిక సహాయం, తదితరాలపై ఈ శిబిరాల నందు వివరిస్తారని, ఆయన తెలిపారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ, ఉత్పత్తి పెంచడం, వ్యాధుల నివారణ, పశు పోషణ ఖర్చు తగ్గించడానికి అనేక చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు.

## పేద మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యసహాయం



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** ప్రజల ఆరోగ్యమే ప్రధానంగా పేద మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య సహాయాన్ని అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొవ్వూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు కాబడిన చెక్కులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వాడపల్లి గ్రామానికి చెందిన బెజవాడ పోచమ్మకు 30,028 రూపాయల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ కుమార్, మద్దిపట్ల శివరామకృష్ణ, ఎంపీపీ కాకర్ల నారాయణ, మద్దుపట్ల సురేష్, జనసేన కొవ్వూరు మండల అధ్యక్షులు సుంకర సత్తిబాబు, గంగుమల్ల స్వామి, తదితర ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కలక్టరేట్‌లో యోగి వేమన జయంతి వేడుకలు

**- జెసి చిన్న రాముడు**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జీవిత సత్యాలను పద్యాల రూపంలో అందించిన మహెూన్నత వ్యక్తి యోగి వేమన అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు పేర్కొన్నారు. స్థానిక కలక్టరేట్‌లో ఆదివారం ఉదయం యోగి వేమన జయంతి వేడుకలు సందర్భంగా యోగి వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి ఎస్. చిన్న రాముడు మాట్లాడుతూ, యోగి వేమన జయంతి శుభాకాంక్షలు తెలియ చేశారు. వేమన ఎన్నో భోగ భాగ్యాలు అనుభవించి, అవి ఏవీ జీవిత సత్యాలు కాదని తన రచనలు ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తిత్వం కలిగిన వారన్నారు. తన రచనలు ద్వారా గొప్ప తెలుగు తత్వవేత్త మరియు కవిగాను, ఆయన కవితలు తెలుగులో సరళమైన భాష మరియు స్థానిక యాసలను ఉపయోగించడం ద్వారా ప్రతి ఒక్కరికీ దగ్గర అయ్యాయన్నారు. ఉప్పు కర్పూరం ఒక్కలా ఉన్నా రుచులు వేరని ఉప్పకప్పురంభు పద్యం ద్వారా, మనుషులందు పుణ్య పురుషులు 6వేరయా అంటూ మానవుల్లో స్వభావరీత్యా కలిగిన వ్యత్యాసాన్ని తన రచనలు ద్వారా చాటి చెప్పడం జరిగిందన్నారు. వేమన పద్యాలు తెలియని తెలుగువారు ఉండరనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు.ఆయన రచనలు ద్వారా జీవితా సత్యాలను తెలుసుకుని భావితరాలకు అందించే ప్రయత్నం ప్రతి ఒక్కరు చెయ్యాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి టి సీతారామ మూర్తి, జిల్లా బిసి సంక్షేమ అధికారి బి శశాంక, కలక్టరేట్ ఎవో ఎండీ ఆలీ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శ్రీ సత్యదేవుని రథోత్సవం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఆదివారం శ్రీ స్వామివారి రథోత్సవ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. వచ్చిన భక్తులు టికెట్ తీసుకుని స్వామివారి రథ సేవలో పాల్గొన్నారు. భక్తులు గ్రామస్తులు రథంతోపాటు రాజగోపురం చుట్టూ ప్రదక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ రథోత్సవ సేవలో ఆలయ వేద పండితులు, ఆలయ అర్చకులు, అర్చకులు, ఏఈ ఓ.కొండలరావు, పిఆర్ఓ దామోర్ల కృష్ణారావు, ఆలయ సూపర్డెంట్లు సుబ్రహ్మణ్యం, సతీష్, సూపర్డెంట్ ఐ.వి.రామారావు, గణపతి, దేవస్థానం అధికారులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్య కార్మికులకు రేషన్ కిట్స్ పంపిణీ






రంపచోడవరం,మేజర్‌న్యూస్: నారాయణసేవలో భాగంగా సిరిగిందలపాడులోని శ్రీ రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో రంపచోడవరం గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్లు పంపిణీ చేశారు. స్వామి వివేకానంద 163వ జయంతి ఉత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం రంపచోడవరం గ్రామ పంచాయతీ లో పనిచేసే 17మంది పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్స్ వితరణ జరిగింది. ఒక్కొక్క రేషన్ కిట్‌లో 9రకాల వంట సరుకులు కందిపప్పు కిలో, మినపప్పు కిలో, పంచదార కిలో, గోధుమ పిండి కిలో, వేరుశెనగ గుళ్ళు కిలో, ఇడ్లీ రవ్వ కిలో, కరాచీ రవ్వ కిలో, వంటనూనె కిలో, టీ పౌడర్ 100 గ్రాములు అందజేసారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు అన్నదానం చేశారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ దాసరి ఉమా మహేష్, గ్రామ పంచాయతీ శానిటేషన్ సెక్రటరీ బి. స్. వి. వి సత్య నారాయణ రెడ్డి, రామకృష్ణ మిషన్ మెడికల్ క్యాంప్ కో ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్స్ సూర్య, దాసరి పెద్ద అప్పారావు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

**- పాల్గొన్న భక్తులు**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆసాదులు, సిబ్బంది ఎస్.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో మారథన్





**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఆదివారం కాకినాడ సీపోర్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కాకినాడ మారథన్'లో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ కాకినాడలో యన్.టి.ఆర్ బీచ్ మొదలుకొని ఈ మారథన్ నిర్వహించినట్లు తెలిపారు. కాకినాడ పరిసరప్రాంతంలో ఉన్న రన్నర్స్ మరియు ఆసక్తి కలిగిన యువతీయువకులు, విద్యార్థినీ విద్యార్థినులు పాల్గొని ఫిజికల్ ఫిట్‌నెస్ ఆవశ్యకతను తెలియజేసారని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన ఎన్. ఎస్.ఎస్ బృందం మరియు వాలంటీర్లు ఈ మారథన్‌లో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ డా.వై.డి. రామారావు, ఓఎన్జీసీ మరియు సీపోర్ట్ ఆథారటీస్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం నేటి మానవజీవన శైలి విధానానికి ఫిజికల్ ఫిట్‌నెస్, రన్నింగ్ ఆవశ్యకత అద్దం పట్టేలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్. ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ పి.సురేఖ దేవి, ఫిజికల్ డైరెక్టర్ యన్.సత్యవతి, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆపన్న హస్తం

**- కష్టంలో ఉన్న కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** మనం సంతోషంలో ఉన్నప్పుడు అందరూ వస్తారు.. అదే కష్టంలో ఉంటే.. ఐనవారు కూడా పరాయివాళ్ళు అయ్యే కాలం ఇది.. ఇది జగమెరిగిన సత్యం. కానీ మన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాత్రం ఎవరికి కష్టమొచ్చినా.. బాధ వచ్చిన మీకు నేనున్నా అంటూ ఆపన్న హస్తం అందిస్తూ ఆర్థిక సహాయం చేయటంతోపాటు ఆ కుటుంబాలకు ధైర్యం చెబుతూ ఓదార్పు, పరామర్శలు చేస్తూ తన మానవత్వం చాటుకుంటున్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన రామచంద్రపురం నియోజవర్గం ప్రజల రుణం తీర్చుకునే దిశగా నిత్యం తపన పడుతున్నారు. మంత్రి సుభాష్ దాతృత్వం, ఔదార్యం, దయాగుణం కోసం ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గత 20 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తనకు తోచిన సహాయం అందిస్తూనే ఉన్నారు. రామచంద్రపురం నియోజవర్గం ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ముందుకు సాగిపోతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం వెల్ల గ్రామంలో ఇటీవల అకాల మృతి చెందిన యార్లగడ్డ శ్రీను కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు రూ. 25 వేలు ఆర్థిక సహాయం అందించి, ఆ కుటుంబాన్ని ఓదార్చి, ధైర్యం చెప్పారు. అదే గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన కోనప రెడ్డి వరలక్ష్మి, తుమ్మరపల్లి మంగలక్ష్మి కుటుంబాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్.. కూటమి నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులతో కలిసి పరామర్శించి ఓదార్పు చెప్పారు. తన దైనందిన బిజీ కార్యక్రమాలు ఉన్నప్పటికీ తన సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తూ.. ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆపదలో, కష్ట కాలంలో ఉన్న కుటుంబాలు స్వాంతన పొందే విధంగా ఆర్థికంగా సహాయం చేస్తూ వారి కుటుంబాలకు కొండంత అండగా నిలబడుతున్నారు. మంచి మనసు, మానవత్వం ఉన్న నాయకుడు మా నియోజకవర్గానికి మంత్రిగా ఉండటం మా అదృష్టమంటూ పలువురు రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు మంత్రి సుభాష్ సేవలను అభినందించారు.

## రేషన్ షాపులకు వ్రాత పరీక్షలు నిర్వహణ

**- ఆర్డీవో రాణి సుస్మిత**



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** కొవ్వూరు డివిజన్ పరిధిలో 73 రేషన్ షాపులకు వ్రాత పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని ఆర్డిఓ రాణి సుస్మిత తెలిపారు. ఆదివారం కొవ్వూరు లోని ఏబీఎన్ అండ్ పి ఆర్ ఆర్ డిగ్రీ కాలేజీ నందు కొవ్వూరు డివిజన్ పరిధిలో రేషన్ షాప్ డీలర్స్ ఎంపిక రాత పరీక్ష లను నిర్వహించారు.ఆర్డీవో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ కొవ్వూరు డివిజన్ పరిధిలో 73 రేషన్ షాపులకు 132 మంది దరఖాస్తు చేసుకోగా 124 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.

ఈ పరీక్షలలో అభ్యర్థులకు 80 % మార్కులకు రాత పరీక్ష ఉంటుందని 20 % మార్కులకు మౌఖిక పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు తాసిల్దార్ డి.దుర్గాప్రసాద్, సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్, సునీత, ఆర్ ఐ. సర్వేశ్వరరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' నిర్వహణ

**- ఆర్డీఓ శ్రీరమణి**



**పెద్దాపురం,మేజర్‌న్యూస్:** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వ హించడం జరుగుతుందని, ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. కావున డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో గల ప్రజలు ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సద్వినియోగం చేసుకోవలసినదిగా తెలిపారు.

# 'ఐటీడీఏ' పాలకవర్గం బైలా మార్పు చేయాలి

**- ముఖ్యమంత్రికి మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి లేఖ**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పాడేరు జిల్లా కలెక్టర్ ను రంపచోడవరం ఐటీడీఏ పాలకవర్గం చైర్మన్ గా, జిల్లా అధికారులను సభ్యులుగా మార్పు చేసి వెంటనే రంపచోడవరం, చింతూరు ఐటిడిఏ పాలకవర్గ సమావేశాలు నిర్వహించేందుకు ఆదేశాలు ఇవ్వాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రికి ఒక లేఖ వ్రాసినట్లు ఆయన తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లకు ఆయా జిల్లా కలెక్టర్లు చైర్మన్లుగా, జిల్లా అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. గవర్నర్ బాడీ సమావేశం నిర్వహణకు 1976 వ సంవత్సరం నుండి సొసైటీగా రిజిస్టరు అయ్యారని ఆయన పేర్కొన్నారు. కాగా రంపచోడవరం, చింతూరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ చైర్మన్ గా, జిల్లా అధికారులు సభ్యులుగా ఉన్నారని, అయితే 2022వ సంవత్సరంలో రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటు అయినప్పటి నుండి రంపచోడవరం, చింతూరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలను పాడేరు జిల్లాలో కలిపారన్నారు. అందువల్ల రంపచోడవరం, చింతూరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలకు పాడేరు జిల్లా కలెక్టర్‌ను చైర్మన్‌గా, జిల్లా అధికారులను సభ్యులుగా గవర్నమెంట్ బాడీ సమావేశమునకు బైలా మార్పు చేయాల్సి ఉందన్నారు. రంపచోడవరం సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ఐటీడీఏ గవర్నమెంట్ బాడీ సమావేశం 2021 డిసెంబర్లో జరిగిందని, కానీ ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఈ సమావేశం జరగాల్సి ఉందన్నారు. పాడేరు జిల్లా కలెక్టర్‌ను ఐటీడీఏ చైర్మన్‌గా, జిల్లా అధికారులను సభ్యులుగా మార్పు చేసి వెంటనే రంపచోడవరం, చింతూరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థల గవర్నమెంట్ బాడీ సమావేశాలు జరిగేటట్లు ఆదేశాలు ఇప్పించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# డ్రోన్ సాయంతో కషాయాలు పిచికారి



– ప్రకృతి వ్యవసాయంలో నూతన పద్ధతులు

పెరవలి, మేజర్ న్యూస్ : కానూరు గ్రామంలో జనవరి 19వ తేదీ ఆదివారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఆచరిస్తున్న రైతు బూరుగుపల్లి రాజు వ్యవసాయ క్షేత్రంలో సుమారు 15 ఎకరాలకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా కషాయాలను డ్రోన్ల సహాయంతో పిచికారి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ మహాలక్ష్మి, ఫార్మర్ సైంటిస్ట్ ధనలక్ష్మి, మెంటర్ ఇన్సెంటివ్ రాజేశ్వరి , ఐసిఆర్ పి గోపి నాగలక్ష్మి, గనెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాజానగరం మండల స్థాయి "పిజిఆర్ఎస్"కు హాజరు కానున్న కలెక్టరు ప్రశాంతి



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో భాగంగా రాజానగరం మండలం పరిధిలో నిర్వహించే కార్యక్రమము పాల్గొననున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేసారు. స్థానిక రాజానగరం ఎమ్ పి డి వో కార్యాలయం నుంచి హాజరు కానున్నట్లు , అదే సమయంలో జిల్లా స్థాయి అధికారులు అందరూ సోమవారం యధావిధిగా కలక్టరేట్ నుంచే హాజరు కానున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు.జిల్లా, డివిజన్ మండల స్థాయి పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి అందరూ జిల్లా , డివిజన్ ,మండల స్థాయి అధికారులు ఆయా ప్రధాన కేంద్రం నుంచి తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించాలని ఆదేశించారు.

# ఇరిగేషన్ స్థలమా...కబ్జా చేసేయ్







- ఆక్రమణలో ఇరిగేషన్ ఆర్ అండ్ బి రోడ్లు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు
- ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి
- చోద్యం చూస్తున్న అధికారులు

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం మండల పరిధిలో కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్అండ్‌బి రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో ఇరుకు రోడ్డులో ప్రయాణంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత ప్రభుత్వంలో లొల్ల నుండి వద్దిపర్రు వరకు అద్వాన్నంగా వున్న రోడ్డును రెండు లైన్ల రహదారిగా నిర్మించారు. దీంతో ఈ రోడ్లు గుండా ప్రయాణం చేసే వాహనదారులకు వాడపల్లి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రయాణములో కష్టాలు తొలిగాయి. అయితే ఆర్అండ్‌బి, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్య వైఖరితో కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్డు ఆక్రమణలకు గురి అవుతుంది. ఆత్రేయపురం కాలువరేవులో రోడ్డు మొత్తంబార్బర్ షాప్‌లు, పూతరేకుల తయారీ షాప్‌లు రోడ్డు మధ్యలో పెట్టి ఆక్రమణలకు గురి అవ్వడంతో తరచుగా పలువురు ప్రయాణికులు, వాడపల్లి ఆలయానికి వచ్చే భక్తులు మండల ప్రజలు ప్రమాదలబారిన పడుతున్నారు శనివారం భక్తుల రాకపోవలతో పలువురు భక్తుల వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. ఆత్రేయపురం పశువులను కడిగే రేవు పక్కన ఉన్న ఇరిగేషన్ స్థలంలో ఒక బార్బర్ షాప్ ఉంది. గతంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్తే ఆపక్కనే ఉన్న షాపులనన్నిటిని తొలగించారు. అయితే మళ్లీ అదే ప్లేస్‌లో బార్బర్ షాప్ పెట్టారు. మళ్లీ తొలగించాలని ఎన్నిసార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన దాన్ని తొలగించిన పాపాన పోలేదు. ఆత్రేయపురం లాకుల నుండి లొల్ల మధ్యలో మలుపులో ఇరిగేషన్ స్థలంలో అక్రమంగా ఒక వ్యక్తి ప్రభుత్వ స్థలాలలో ఉన్న చెట్లను నరికి కలపను ఇక్కడ వేస్తున్నాడు. ఎన్నోసార్లు ఇరిగేషన్ అధికారులకు తెలియజేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో ఈ మలుపులో ఇరువురు చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు, నాయకుల అండదండలతో ఇప్పటికీ ఈ రహదారిలో ఎన్నో షాపులు, భవనాలు కడుతూనే ఉన్నారు. అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో ఉండటంతో ఇవి పునరావృతం అవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బి ఇరిగేషన్ అధికారులు కలుగజేసుకుని ఆక్రమణలు తొలగించి ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, మండల ప్రజలు, వాడపల్లి ఆలయానికి వచ్చే భక్తులు కోరుతున్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన రేషన్ డీలర్ల పరీక్ష

– పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టులకు సంబంధించి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 21 మండలాల్లో 146 రేషన్ షాపుల ఖాళీలకు గాను 709 మందికి కాకినాడ, పెద్దాపురం డివిజన్లో ఏర్పాటుచేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 654 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. కాకినాడ డివిజన్ కు సంబంధించి10 మండలాల్లో ఉన్న 96 ఖాళీలకు 584 అభ్యర్థులకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీఆర్ జూనియర్ కళాశాలలో పరీక్ష నిర్వహించగా 535 మంది పరీక్షకు హాజరైయారు. ఈ రేషన్ డీలర్ల పరీక్షను రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లి బాబు పరిశీలించారు. అదేవిధంగా పెద్దాపురం డివిజన్‌లోని 11 మండలాల్లో 50 రేషన్ డీలర్ల ఖాళీలకు 125 మందికి పెద్దాపురం ఎంఆర్ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహించగా 119 మంది పరీక్షకు హాజరైయారు. ఈ పరీక్షా కేంద్రాన్ని ఆర్డీవో కె.శ్రీరమణి తనిఖీ చేసి అభ్యర్థుల హాజరు వివరాలు పరిశీలించారు.

## రహదారి భద్రతపై వాహన వినియోగదారులకు అవగాహన



**బిక్కవోలు / రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం 2025 లో భాగంగా జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్ సూచనల మేరకు ఆదివారం ది: 19-01-2025న బిక్కవోలులో సామూహికంగా వాహన తనిఖీలు నిర్వహించి రహదారి భద్రత పై వాహన వినియోగదారులకు అవగాహన కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రతకు విరుద్ధంగా నడుపుతున్న వాహన దారులను తనిఖీలు చేసి 10 వాహనముల పై కేసులు బుక్ చేసి విసిఆర్ లు జారీ చేసారు. ఈ కార్యక్రమములో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు జి. రాదికా దేవి , పి.వి.వి.డి. సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 85వ హ్యాపీ మొబైల్ స్టోర్ ప్రారంభం

– తక్కువ ధరలకే మొబైల్స్... సిఎండి కృష్ణ పవన్

**అమలాపురం, మేజర్ న్యూస్ :** తెలుగు రాష్ట్రాల్లో లో సరికొత్త ట్రెండ్ క్రియెట్ చేస్తూ తిరుగులేని ఆఫర్స్ ఇస్తూ మన 15 లక్షలు పైగా వినియోగదారుల ఆనందానికి కారణమైన హ్యాపీ మొబైల్స్ ఇప్పుడు అమలాపురంలో సినీతార మీనాక్షి చౌదరి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం అయింది, ఈ సందర్భంగా ప్రముఖ హిరోయిన్ మీనాక్షి చౌదరి రెడ్‌మీ 14సి 5జి మొబైల్ ఫోన్ ను లాంచ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా స్మార్ట్ మొబైల్స్, ఎల్ఈడి స్మార్ట్ టీవీలు మరియు లాప్‌టాప్‌లపై మరెన్నో వినూత్న ఆఫర్స్‌ని అమలాపురంలో నూతన షో రూమ్ ప్రారంభంతో పాటు సంక్రాంతి సందర్భంగా కస్టమర్లకి అనేక రకాల ఆఫర్లను అందుబాటులోకి తెచ్చింది. తమ కస్టమర్లకి ఆన్లైన్ కన్నా బెటర్ ఆఫర్స్‌తోపాటుగా ఎన్నో అత్యద్భుతమైన డీల్స్, ఆఫర్స్ మరియు స్పెషల్ డిస్కౌంట్స్ ఎన్నో ఈ సందర్భంగా అందిస్తున్నామని హ్యాపీ మొబైల్స్ యాజమాన్యం ప్రకటించింది. హ్యాపీ మొబైల్ స్టోర్స్‌లో అన్నిటికన్నా బెటర్ ఆఫర్స్‌తో పాటుగా, మొబైల్స్, ఎల్ఈడి స్మార్ట్ టీవీలు మరియు లాప్టాప్‌ల కొనుగోలుపై ఐసిఐసిఐ బ్యాంక్ ద్వారా 10 శాతం భారీ డిస్కౌంట్ పొందవచ్చు అని హ్యాపీ మొబైల్స్ సి.యం.డి కృష్ణ పవన్ మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోట సంతోష్ తెలిపారు. అదేవిధంగా నూతన షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా అన్ని రకాల మొబైల్స్ కొనుగోలుపై ఐసిఐసి కార్డు ద్వారా 10% తగ్గింపు లోన్ పొందవచ్చు అని, అదేవిధంగా అమెజాన్ హాస్టల్ జొమాటో గోల్డ్ ఒవే మరెన్నో సబ్స్క్రయిబ్ ద్వారా పూర్తిగా ఉచితమని తెలిపారు. అదేవిధంగా మొబైల్స్ సాంసంగ్ ఏ35, ఏ 55, ఒప్పో రేణో 12, ఒప్పో ఎఫ్27, వివో వై 200 మరియు సెల్యులార్ టి.వి కొనుగోలుపై 15,000 రూపాయలు విలువ చేసి విలువ కలిగిన సౌండ్ బార్ ఉచితమని మరియు సబ్‌స్క్రిప్షన్ కూడా ఉచితమని అలాగే వివో వై28, సాంసంగ్ ఏ15 మొబైల్స్ కొనుగోలుపై 9000 రూపాయల విలువ కలిగిన పవర్ బ్యాంక్, బడ్స్, స్మార్ట్ వాచ్ ఉచితం మరియు సబ్స్క్రైబ్ లు ఉచితమని 43 సైజ్ సెల్యులర్ స్మార్ట్ టీవీ కొనుగోలుపై 32 సైజ్ టీవీ ఉచితం మరియు సబ్స్క్రైబ్ లు ఉచితమని అంతేకాకుండా అనేక రకాల ఆఫర్‌లను అందిస్తున్నామని అని హ్యాపీ మొబైల్స్ సి.యం.డి కృష్ణ పవన్ మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోట సంతోష్ తెలిపారు.

## విశాఖ స్టీల్ ప్లాంటుకు భారీ ఆర్థిక ప్యాకేజీపై తుమ్మలపల్లి రమేష్ హర్షం



జగ్గంపేట, మేజర్ న్యూస్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకుంటూ కేంద్ర ప్రభుత్వం భారీ ఆర్థిక ప్యాకేజీ ఇస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమని జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ ప్యాకేజీతో స్టీల్ ప్లాంట్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు. గతంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ వివిధ రూపాల్లో స్టీల్ ప్లాంటు ప్రయివేటీకరణ చేయొద్దని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఎన్నికల సమయంలో కూడా స్టీల్ ప్లాంట్ ప్రస్తావనపై కేంద్రంతో చర్చించారన్నారు. ఎన్నికల ముందు పవన్ కల్యాణ్ చేసిన పోరాటాలు, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్, కూటమి నాయకుల ప్రత్యేక కృషితో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు భారీ ప్యాకేజీ ప్రకటించడం పట్ల ప్రధాని మోదీకి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఏజెన్సీ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలోని ఆశా వర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కారం చెయ్యాలని, లేకపోతే ఐటీడీఏ కార్యాలయం వద్ద మరోసారి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశం కొమరం చెల్లాయమ్మ అధ్యక్షతన జరిగింది. కమిటీ తీసుకున్న నిర్ణయాలు ఏజెన్సీ ఏడు మండలాల పరిధిలో ఉన్నా ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయటంలో నిర్లక్ష్యం చేసారని ఆందోళన బాట పడుతున్నట్టు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు శూన్యమేనా ప్రశ్నించారు. గిరిజన ఆశా వర్కర్లపై ఎందుకింత నిర్లక్ష్యం అంటూ మండిపడ్డారు. ఆశా వర్కర్లు మరో పోరాటానికి సిద్దపడితే తప్పా పరిష్కారం చూపరా అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయటంలో ఐటీడీఏ అధికారులు నిర్లక్ష్యం వహించారని, ఏడిఎం అండ్ హెచ్ ఓ తో చర్చలు జరిపినప్పటికీ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం నుంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండానే జిల్లా డిసిఎం మనోజ్ కుమార్ రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో 11 మండలాల్లో 60 ఏళ్ళు నిండిన వర్కర్లను బలవంతంగా ఇంటికి పంపించే పనిలో అన్ని పిహెచ్ వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని డిసిఎం నిర్ణయం తీసుకోవాలని, 25 సంవత్సరాలుగా ఎన్నో కష్టాల్ని ఓర్చుకుంటూ చాలిచాలనీ గౌరవ వేతనంతో పనిచేసి యూనియన్ సహకారంతో ఆశా వర్కర్లుగా ప్రస్తుతం పని చేస్తున్న గిరిజన ఆశా వర్కర్లపై ఏ మాత్రం జాలి లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వారి సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులే ఇన్ని సంవత్సరాలుగా ఎనలేని సేవలు చేసి, ఇప్పుడు ఖాళీ చేతులతో ఇంటికి పంపించాలని చూడటం దుర్మార్గమైన చర్య అని ఆమె ఆరోపించారు. రంపచోడవరం, చింతూరులో ఎడిఎం అండ్ హెచ్ఓ లు, గిరిజన ప్రాంతంలో రెండు ఐటీడీఏ లు ఇద్దరు ఐఏఎస్ అధికారులు ఉన్నప్పటికీ ఆశా వర్కర్స్ యూనియన్ తో ఏమాత్రం చర్చలు జరుపకుండా జిల్లా డిసిఎం ఎందుకు సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడానికి ప్రభుత్వం రాష్ట్ర యూనియన్ తో చర్చలు జరిపిన తర్వాత ఒప్పంద జీవోలు విడుదల చేయకుండానే జిల్లా డిసిఎం పేరుతో ఏజెన్సీ మొత్తం అన్ని పి హెచ్ సి లలో 60 ఏళ్ళు నిండిన వారు పని చేయకూడదంటూ ఒత్తిడి చేస్తున్నారని ఆశా వర్కర్స్ యూనియన్ నిరసన వ్యక్తం చేసింది. జిల్లా డిసిఎం జారీ చేసిన ఆదేశాలు వెనక్కి తీసుకొని వర్కర్లను విధుల్లో కొనసాగించాలని కోరుతూ రంపచోడవరం ఐటీడీఏ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేయబోతున్నట్టు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఇప్పటికైనా 60 ఏళ్ళు నిండిన ఆశా వర్కర్లను విధుల్లో కొనసాగించకపోతే ఏజెన్సీ మొత్తం విధులు బహిష్కరించి సమ్మె బాట పట్టాల్సి వస్తుందని ఆమె హెచ్చరిక చేశారు.

## పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీఓ శ్రీరమణి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం డివిజన్‌లోని 11 మండలాలకు సంబంధించి 55 ఎఫ్.పి. షాపులకు శాశ్వత ప్రతిపదికన నియమకానికి ఆదివారం పట్టణంలోని మహారాణి కళాశాల నందు ధరఖాస్తుదారులకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రాన్ని ఆర్డీఓ కె.శ్రీరమణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ 50 ఎఫ్.పి. షాపుల కోసం 197 ధరఖాస్తులు అందగా, వీరిలో 125 మంది ధరఖాస్తుదారులు పరీక్షకు హాజరు కావడానికి అర్హత పొందగా, వీరిలో 119 మంది ధరఖాస్తుదారులు మాత్రమే పరీక్షకు హాజరయ్యాయరని ఆమె తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో సూపర్‌వైజర్‌లుగా ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డి.టి.భానుకుమార్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది విజయకుమారి, దయానందరాజు, ప్రసాద్, రమేష్ కుమార్, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాల దారులు హెల్మెట్ వినియోగం తప్పనిసరి


**భీమవరం,మేజర్ న్యూస్:** 36వ జాతీయ భద్రత మాసోత్సవం సందర్బ ంగా ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని పశ్చిమ గోదావరిజిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయ రవాణా తనిఖీ అధికారులు అన్నారు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా ఆదివారం భీమవరంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని రవాణా శాఖ అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భీమవరం రవాణా కార్యాలయానికి చెందిన పలువురు రవాణా తనిఖీ అధికారులు పాల్గొని వాహనదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. నాలుగు చక్రాల వాహన డ్రైవరు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని వాహనాలకు ఇన్సూరెన్స్ పొల్యూషన్ రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని వారు సూచించారు.

వాహనాలు నడిపే సమయాలలో సెల్ఫోన్ మాట్లాడి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వారితో వారి అనుభవాన్ని కూడా అందరికీ తెలియజేశారు. సిఎంవి రూల్ 104 ప్రకారం వాహనం ముందు,వెనుక భాగాల్లో రేడియం స్టిక్కర్స్ లేని వాహనాలకు అంటించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రవాణా తనిఖీ అధికారులు కే. ప్రసాద్, ఎం రవికుమార్, ఎన్ ఎల్ ఎస్ లక్ష్మి,ఏఎస్‌పి తేజ,సిబ్బంది పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల హృదయాలలో ఎన్‌టిఆర్‌కు సుస్థిర స్థానం

**కలిదిండి,మేజర్ న్యూస్ :** రాజకీయాలలో కొత్త నిర్వచనం తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. కలిదిండి మండలం మట్టగుంట గ్రామంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి సందర్భంగా కూటమి నాయకులతో కలిసి ఎన్‌టిఆర్ చిత్రపటనికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగంలో తన నటనతో తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించి తెలుగు దేశం పార్టీని స్థాపించి" కుడు గూడు నీడ "నినాదంతో అధికారంలోకి వచ్చి కరణం మునసబు వ్యవస్థలను పటేల్ పట్వారి వ్యవస్థలను రద్దుచేసి తెలుగు ప్రజలకు ఆరాధ్యుడైనడని తెలిపారు. అలాగే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించి ఎందరో బీసీ నేతలను రాజకీయంగా ఉన్నత స్థానంలో నిలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ వైస్ చైర్మన్ నాగిడి వీరబ్రహ్మం,మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బళ్లా రాజు, కూటమి నాయకులు అంద్రాజు దుర్గారావు, తిరుమాని పాండురంగారావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, రేవుగణపతి, కోకాతాతయ్య, కోపనాతి వెంకటేశ్వరరావు, మోకా రామకృష్ణ,తిరుమల శెట్టిశ్వర పరశురాముడు, కొల్లాటి గోకనేశ్వరరావు, పెదసింగుచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## మెర్లపాలెంలో ఘనంగా జాతర మహోత్సవాలు






**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని మెర్లపాలెం గ్రామంలో ఆదివారం అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత పద్మాలవెంకమ్మ అమ్మవారి జాతర, ఆకులమ్మ అమ్మవారి జాతరలు ఉత్సాహ కమిటీలు వేరువేరుగా నిర్వహించాయి. ఈ సందర్భంగా పద్మాలవెం కమ్మ అమ్మవారిని గౌతమి గోదావరికి మేళతాళాలతో తీసుకుని వెళ్లి స్నానాధి, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో వివిధ సాంస్కృతిక కళానృత్యాలతో జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం రాత్రి ఆకులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా గరగ నృత్యాలతో ఆకులమ్మ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.

# అపూర్వ ఆత్మీయ సమ్మేళనం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** అ'పూర్వం... ఆత్మీయ సమ్మేళనం వారంతా ఒకే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకొని నేడు వేర్వేరు రంగాల్లో వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. 2008-09 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా, వారంతా ఒక్కచోట కలుసుకునేందుకు చిన్ననాడు చదువుకున్న మల్లిసాల ఉన్నత పాఠశాల వేదికైంది. జగ్గంపేట మండలం మల్లిసాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు తలపించే విధంగా జరిగింది. పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి గత స్మృతులను, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరునొకరు ఆలింగనం చేసుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ స్థితిగతులను ఒకరితో ఒకరు పంచుకున్నారు. పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా ఉత్సాహంగా, ఉల్లాసంగా స్కూలు గ్రౌండ్‌లో కాలం గడిపారు. పదో తరగతి పాసై 16 సంవత్సరాలు గడవడంతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుని, విద్యార్థులంతా ఇలా కలుసుకోవడం వల్ల స్నేహాలు బలపడతాయని తెలిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులంతా కలిసి మెమొంటోలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆనాటి ఉపాధ్యాయులు సుబ్బయ్య మాస్టారు, దారబాల చక్రధర్, ఇంగ్లీష్ మాస్టర్ తాతాజీ, జాజుల అచ్చుత్, శ్రీను మాస్టారు తదితర ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాము విద్యాబుద్ధులు నేర్పిన చిన్నారులు తమను గుర్తించుకుని ఈ కార్యక్రమానికి ఆహ్వానించి సత్కరించడం మరపురానిదని అన్నారు. ఈ కార్యక్రమంలో 2008-09 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.